సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



అనుమతులు తప్పనిసరి
రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రకటనలు, ర్యాలీల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని డీఆర్వో పద్మావతి తెలిపారు. IIలో



కేకేలైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు
ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ శనివారం కేకే లైన్‌లో భద్రత తనిఖీలు నిర్వహించారు. IIలో

రంజాన్ వేళలు
పాడేరు, అరకు
ఇఫ్తార్ (ఆది) 6.15 సహర్ (సోమ) 4.30
రంపచోడవరం
6.28 4.35

న్యూస్‌రీల్

17న సుందర సీతారామ చంద్రస్వామి కల్యాణం
- ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



స్వామి వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవో కావూరి చైతన్య

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి శ్రీ సుందర సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పోస్టర్‌ను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆవిష్కరించారు. శనివారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు,ఆలయ చైర్మన్ రేవు బాలరాజు కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను పీవోకు అందజేశారు. ఈ నెల 17న శ్రీరామగిరిలో నిర్వహించనున్న స్వామి వారి కల్యాణానికి విచ్చేయాలని కోరారు. దేవదాయశాఖ సాయిబాబా, కమ్మచిచ్చు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

కొయ్యూరు: మండలంలోని ఆడాకులకు చెందిన ఆరుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. నిజాయితీగా పనిచేస్తున్న తమపై కొందరు తప్పుడు ప్రచారం చేయడం బాధ కలిగిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా పత్రాలను ఆడాకుల కార్యదర్శి దుర్గామల్లేశ్వరరావుకు అందజేశారు. ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో వలంటీర్‌గా బాధ్యతలు చేపట్టిన తమపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మనస్తాపానికి గురి చేశాయన్నారు. జగనన్న కల్పించిన అవకాశం ఎన్నటికీ మరువలేనిదన్నారు.

నేటి నుంచి మత్స్యదేవత జాతర
జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు, వనభరంగిపాడు, కొత్తకుండలు, లక్కేడులంక, పినగరువు గ్రామాల ఆరాధ్య దైవం శ్రీమత్స్యదేవత జాతర మహోత్సవాలు ఈ నెల ఏడు నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ ఐసరం హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి మంగళవారం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందన్నారు. సతకంపట్టు నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పూర్తి వివరాలకు రాంబాబు: 7382939972, కిరణ్: 9494938006 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

చెక్‌పోస్టు వద్ద కలప స్వాధీనం



పందిరిమామిడి చెక్‌పోస్టు వద్ద కలపతో పట్టుబడిన వాహనం

దేవీపట్నం: అక్రమంగా తరలిస్తున్న కలపను ఇందుకూరు రేంజ్ దామనపల్లి సెక్షన్ పరిధిలోని పందిరిమామిడి ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్టు రేంజ్ అధికారి దుర్గాకుమార్ తెలిపారు. వాహనంలో 12 మారుజాతి కలప దుంగలను తరలిస్తుండగా పందిరిమామిడి చెక్‌పోస్టు వద్ద అటవీ సిబ్బంది పట్టుకున్నట్టు ఆయన వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ. 18,829 ఉంటుందన్నారు. బోలగొండ గ్రామ సమీపం నుంచి రంపచోడవరం తరలిస్తుండగా సెక్షన్ అధికారి టి. వీరన్నదొర, సిబ్బంది వి. శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారని ఆయన తెలిపారు.

కొండంత మార్పు..



అడుసు కట్టిన జుట్టు, చెవిలో చుట్ట, చాలీచాలని గోచీ, మొలలో కత్తి, చేతిలో మరో బండకత్తి ఇది ఒకప్పటి శిఖరాగ్రంలో ఉంటున్న కొండరెడ్ల పరిస్థితి. ఇప్పుడు ప్రభుత్వం చూపుతున్న చొరవ..ఐటీడీఏ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆధునిక సమాజం వైపు అడుగులు వేస్తున్నారు. అధికారుల పిలుపు మేరకు కొండదిగి వస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

- కొండరెడ్ల దరి చేరిన సంక్షేమం
- జీవనశైలిలో మార్పు తెచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ
- ఆర్థికాభివృద్ధికి చేయూత
- అందుబాటులోకి వచ్చిన ఉపాధి అవకాశాలు
- అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్

కూనవరం: కొండరెడ్ల జీవనశైలిలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎత్తయిన గుట్టలపై అక్కడక్కడ పది కుటుంబాల చొప్పున గ్రామంగా ఏర్పాటు చేసుకుని విస్తరించి ఉన్న వీరు ఇప్పుడిప్పుడే బాహ్య ప్రపంచంలోకి వస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో ఎత్తయిన కొండలపై జీవనం కొండరెడ్లు జీవనం సాగిస్తున్నట్టు 1989లో అప్పటి ప్రభుత్వం గుర్తించింది.

- అటవీ ఉత్పత్తులు విక్రయించి, అడవి దుంపలు ఆహారంగా తింటూ వాగు నీటిని తాగుతూ వీరు జీవనం సాగించేవారు. కొండలపై చెట్లను తొలగించి పోడు విధానంలో కొండ జొన్న పండించి ఆహారానికి వినియోగించేవారు. అట్టడుగు తరగతికి చెందిన వీరి అభివృద్ధికి అప్పటిలో పీవీటీజీ (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్) సెల్ ఏర్పాటు చేశారు. వీరిని రెండు వర్గాలుగా విభజించిన అధికారులు అప్పటినుంచి వీరిని బాహ్యప్రపంచంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించింది.
- కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ఎత్తయిన కొండలపై జీవనం సాగిస్తున్న 1018 కొండరెడ్ల కుటుంబాలను (జనాభా 6,554) ప్రభుత్వం గుర్తించింది. గత ప్రభుత్వంలో వీరికి ప్రభుత్వ పరంగా ఎటువంటి సంక్షేమ పథకాలు అందేవి కావు. కనీసం ఒక్క పథకం కూడా అందిన దాఖలాలు లేవు.

కూనవరం మండలంలో..
గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల వీరికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేరువయ్యాయి. కూనవరం మండలంలో కూటూరు గ్రామసచివాలయం పరిధిలో సుమారు 10 కొండ రెడ్ల గ్రామాలు ఉన్నాయి. అవే ప్రాంతాలకు చెందిన నలుగురు వలంటీర్లు సేవలందిస్తున్నారు. వారి ద్వారా సంక్షేమ పథకాలన్నీ దరి చేరుతున్నాయి. 67 మంది వృద్ధాప్య పింఛను పొందుతున్నారు. అమ్మ ఒడి 98 మంది, రైతు భరోసా 113 మంది, వైఎస్సార్ చేయూత 44 మంది పొందుతున్నారు.

- కొండరెడ్ల గ్రామాల్లో 54 సోలార్ వీధి లైట్లు ఏర్పాటుచేసింది. గుడిసెలున్న 69 కుటుంబాలకు 690 రేకులు పంపిణీ చేసింది. సోలార్‌తో పనిచేసే మూడు తాగునీటి పథకాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది.



శిఖరాగ్రంలో కొండరెడ్లు నివసిస్తున్న కోపిరిమెట్ట

చింతూరు మండలంలో..
ఏడుగురాళ్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలో కొండలపై 22 గ్రామాలు ఉండగా 170 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడ ఐదుగురు వలంటీర్లు సేవలందిస్తున్నారు. 40 మందికి వైఎస్సార్ పింఛను కానుక, 25 మందికి అమ్మ ఒడి, 35 మందికి రైతు భరోసా, వైఎస్సార్ చేయూత 12 మందికి అందుతోంది.

- తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు సోలార్ మోటార్లతో పథకాలు ఏర్పాటు చేశారు. 18 నివాసిత ప్రాంతాల్లో సోలార్ వీధి దీపాలు అమర్చారు.
- వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో సుమారు 3 వేల జనాభా గల కొండరెడ్లు మైదాన ప్రాంతానికి చేరువలో ఉండి నాగరిక జీవనం గడుపుతున్నారు.

ఐటీడీఏల ఆధ్వర్యంలో..
అడవిలో లభించే ఉత్పత్తులను ఆదాయంగా మార్చుకునేందుకు చింతూరు ఐటీడీఏ ప్రణాళిక పరంగా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా వెదురుతో ఉత్పత్తులు తయారీపై కొండరెడ్లకు శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగా శిక్షణ పొందిన రామిరెడ్డి అనే కొండరెడ్డి వెదురు ఆకృతులతో కళాకృతులు తయారు చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు.

- కూనవరం మండలం కూటూరులో ప్రతీ మంగళవారం జరిగే వారపు సంతలో వెదురు ఉత్పత్తులను విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు.
- అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు గిరిజన సహకార సంస్థ సేవలు మరింత చేరువయ్యాయి. చింతూరు బ్రాంచిలో కుంకుళ్లు, తేనె, షీకాయ వంటి ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తోంది.
- కొండ దిగిరండి.. ఆదుకుంటాం అని చింతూరు ఐటీడీఏ పిలుపుపై శిఖరాగ్ర గ్రామాల కొండరెడ్ల నుంచి మంచి స్పందన వస్తోంది. కూనవరం మండలంలో భైరవపట్నం, పైదిగూడెం, బండారుగూడెం, కొత్తూరు గ్రామాల కొండ రెడ్లు జన జీవన స్రవంతిలోకి వచ్చారు. బండారుగూడెం కొండరెడ్లకు కుటుంబానికి 2 ఎకరాలు చొప్పున 12 మంది ఉమ్మడి రాష్ట్రంలో ఐటీడీఏ కొనుగోలు చేసి ఇచ్చింది.
- కూటూరుగట్టు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 174 కుటుంబాలకు ఒకొక్కరికి ఎకరా చొప్పున పోడు భూములకు పట్టాలిచ్చింది. ఉపాధి హామీ పథకంలో ఉపాధి కల్పిస్తోంది.



టేకులొద్దిలో దివ్య కుటీరం పేరిట నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాల్

కీడుపాక నుంచి బర్త్ వెయిటింగ్ హాల్‌కు..
గిరిజన తెగలకు భిన్నంగా కొండరెడ్ల ఆచార వ్యవహారాలు ఉంటాయి. వీరిలో మూఢనమ్మకాలు అధికం. కీడుపాక ఆచారం మరింత కటువుగా ఉంటుంది. కొండరెడ్డి మహిళలు నెలసరి సమయంలో ఊరికి దూరంగా కీడు పాకను ఏర్పాటు చేసి ఆ ఐదురోజులు అందులో ఉంచుతారు. గర్భిణి అయితే ప్రసవ వేదన సమయంలో అదే కీడుపాకలో ఉండాలి. తనకు తానుగా ప్రసవించి, బొడ్డుతాడు కోసుకొని శిశువుతో పాటు బయటకు రావల్సిందే. పురుషులు ఆ కీడుపాక వైపు కన్నెత్తి చూడకూడదు. అలా చూస్తే అపచారం జరుగుతుందని నమ్ముతారు. ఇప్పుడిప్పుడే ఆ మూఢ నమ్మకాలను నుంచి వారు బయటకు వస్తున్నారు. ప్రభుత్వం ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చింతూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో టేకులొద్దిలో దివ్య కుటీరం పేరిట నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాల్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.



చింతగండిలో ఏర్పాటు చేసిన కీడుపాక (ఫైల్)



ఆటో నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్న కదల ప్రసాదరెడ్డి



కొండరెడ్లు తయారుచేసిన వెదురు తట్టలు, బుట్టలు





కానుమానుకొండలో ఒకప్పుడు తాగునీటికి ఉపయోగించిన చెలమ.. ఇప్పుడు అదే గ్రామంలో కుళాయి ద్వారా తాగునీరు

150 మందికి శిక్షణ ఇచ్చా



కొండరెడ్ల ఆర్థిక పరిస్థితి మెరుగుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిది. వెదురు ఆకృతుల తయారీపై ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ పొంది ఇప్పటివరకు 150 మందికి శిక్షణ ఇచ్చా. శిక్షణ కాలంలో నెలకు రూ.10 వేలు ఐటీడీఏ చెల్లిస్తోంది.

– రామిరెడ్డి, కొండరెడ్డి, టేకులొద్ది, కూనవరం మండలం

కొండ దిగి వస్తే అండగా..



కొండలు దిగితే ఐటీడీఏ అండగా ఉంటుంది. మౌలిక వసతులు కల్పిస్తాం. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. విద్యావకాశాలు అందుబాటులో ఉంటాయి. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ పొంది ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

– కావూరి చైతన్య, ఐటీడీఏ పీవో, చింతూరు

మాచ్‌ఖండ్‌లో పేలిన 11కేవీ కేబుల్
- కొంతసేపు నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి
- శ్రమించి పునరుద్ధరించిన అధికారులు, సిబ్బంది
- అంధకారంలో పరిసర గ్రామాలు



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో పేలిన కేబుల్

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 11 కేవీ కేబుల్ పేలిపోయింది. దీంతో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నీటికొరత కారణంగా ఆరింటిలో ఆరో నంబరు జనరేటర్ మాత్రమే పనిచేస్తోంది. దీని నుంచి ఉత్పత్తి అయ్యే 17 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. వెంటనే స్పందించిన సిబ్బంది, ఇంజినీర్లు తీవ్రంగా శ్రమించారు. సాయంత్రం 4గంటలకు విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. 11 కేవీ కేబుల్ పేలిపోవడం వల్ల మాచ్‌ఖండ్‌తో పాటు ఒనకఢిల్లీ, జోలాపుట్టు క్యాంపులు, పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలు అంధకారంలో ఉన్నాయి. కాలిపోయిన కేబుల్‌ను తొలగించి కొత్త కేబుల్‌ను అమర్చుతామని మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. రాత్రి 10 గంటల సమయానికి కూడా విద్యుత్ రాకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జనారణ్యంలో జింకలు



కొమ్మాది (విశాఖ): జనారణ్యంలో జింకలు సంచరిస్తున్నాయి. బీచ్ రోడ్డు గుడ్లవానిపాలెం వద్ద ముత్యాలమ్మ, భూలోకమ్మ గుడి సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద శనివారం సాయంత్రం రెండు జింకలు సంచరించాయి.

'సంక్షేమం' వైపే ప్రజల మొగ్గు
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- ఇంటింటా ఎన్నికల ప్రచారం




ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: ప్రజలు సంక్షేమ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని మడిచర్ల, వాడపల్లి, చెరువూరు, బోలగొండ, భీమవరం, బందపల్లి, గోగుమిల్లి, తాటివాడ, బూరుగుబంద, మూలపాడు, ధరమడుగుల గ్రామాల్లో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలన సాగిందన్నారు. ఇదే తరహాలో రానున్న రోజుల్లో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీని గెలిపించుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల కుట్రలను సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని, ఐదేళ్ల పాలనలో సీఎం జగనన్న చేసిన అభివృద్ధిని ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఏం చేశారో.. ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి,అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు మరో మూడు ఫోన్ నంబర్లు
సాక్షి,పాడేరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు మరో మూడు ల్యాండ్‌లైన్ ఫోన్ నంబర్లను అదనంగా ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1950 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు , 08935-29912, 299934, 293448 ల్యాండ్ లైన్ నంబర్లు 24 గంటల పాటు కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, బహుమతులు, నగదు అక్రమ తరలింపు, పంపిణీ, మత్తు పదార్థాల అక్రమ రవాణా, పంపిణీకి సంబంధించి ఆయా నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుపై సమీక్ష



సీఈవో సమీక్షకు హాజరైన కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ భావన, డీఆర్వో పద్మావతి

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, చెక్‌పోస్టుల్లో తనిఖీలు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిముఖేష్‌కుమార్‌మీనా శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ భావన, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నియామవళి అమలు,ఇతర ఏర్పాట్లను సీఈవోకు వారు సమగ్రంగా వివరించారు. ఎస్‌డీసీ అంబేద్కర్, నోడల్ అధికారి సువర్ణఫణి పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పనలో రాజవొమ్మంగికి ప్రథమస్థానం
రాజవొమ్మంగి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వేతనదారులకు అత్యధిక పనిదినాలు కల్పించడంలో జిల్లాలో రాజవొమ్మంగి ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో యాదగిరీశ్వరావు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులు మండలానికి చెందిన ఉపాధి సిబ్బందిని జిల్లా స్థాయి అధికారులు శనివారం అభినందించారని తెలిపారు. మండలంలో 8,449 కుటుంబాలకు గడచిన ఆర్థిక సంవత్సరంలో 6,54,372 పనిదినాల్లో ఉపాధి కల్పించినట్టు చెప్పారు. వేతనాల రూపంలో రూ. 15.84 కోట్ల మేర నిధులు విడుదల అయ్యాయని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం





సభలో వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, పాల్గొన్న కార్యకర్తలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

అనంతగిరి: సమన్వయంతో ముందుకు సాగి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని అత్యధిక మెజారిటీ గెలిపించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు అసెంబ్లీ పరిశీలకురాలు శోభ హైమావతి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి పిలుపునిచ్చారు. మండలంలోని ములియగుడ ప్రసాద్‌గార్డెన్స్ వద్ద మండల వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నేతలతో శనివారం సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎంపీపీ శెట్టినీలవేణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించారన్నారు. ఆయన రుణం తీర్చుకునే సమయం వచ్చిందని, రెండు బటన్లను నొక్కి జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ జగనన్న మీద ఉన్న అభిమానాన్ని చాటుకునే సమయం వచ్చిందన్నారు. గత కంటే పోలింగ్ శాతం పెంచేలా ఓటర్లను తీసుకువచ్చే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని కోరారు. మరో రెండు నెలల్లో మన ప్రభుత్వం అధికారం చేపట్టి, ప్రజలందరికీ మంచి పాలన అదింస్తుందన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజేసి మద్దతు కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు, జేఏసీ కన్వీనర్ నవీన్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ గంగులు, మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, ప్రధాన కార్యదర్శి శెట్టి లక్ష్మణరావు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనంతగిరిలో భారీ వర్షం



అరకు-విశాఖ ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు, పోలీసులు



రాయవలసలో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు

- అరకు-విశాఖ రోడ్డులో కూలిన భారీ వృక్షం
- పిడుగుపాటుకు మూడు పశువుల మృతి

అనంతగిరి: మండలంలోని శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండల పరిధిలోని ఘాట్‌రోడ్డులో పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. టోకూరు పంచాయతీ రాయవలసలో పిడుగుపాటుకు సన్యాసి, మంగళ, రామన్నకు చెందిన మూడు పశువులు మృత్యువాతపడ్డాయి. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కిల్లో మోస్య కోరారు. వాతావరణం చల్లపడటంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు.

అరకులోయ రూరల్: అరకు- విశాఖ ఘాట్‌రోడ్డులో సుంకరమెట్ట వ్యూపాయింట్‌కు సమీపంలో భారీ వృక్షం రోడ్డుకడ్డంగా పడింది. దీంతో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న అరకు పార్లమెంట్ అభ్యర్థి తనూజరాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ తదితరులు వెంటనే పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సంతోష్, రెవెన్యూ, గ్రామసచివాలయ సిబ్బంది చేరుకుని చెట్లు తొలగింపు పనులు చేపట్టారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

కేకేలైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ శనివారం కె.కె.లైన్‌లో భద్రత తనిఖీలు నిర్వహించారు. కీలకమైన ఈ కె.కె.లైన్‌లో అత్యధిక భద్రత ప్రమాణాలు పాటిస్తూ.. అన్ని విధాలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ముందుగా ఆయన అరకు రైల్వే స్టేషన్‌లో ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ డిపో, ట్రాక్షన్ సబ్ స్టేషన్ నిర్వహణను పరిశీలించారు. సిమిలిగుడ–అరకు సెక్షన్‌లో లెవల్ క్రాసింగ్ కె.కె.22 వద్ద సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. అనంతరం అరకులోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బంది, అధికారులతో డీఆర్‌ఎం ముఖాముఖి నిర్వహించారు. అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయన వెంట వాల్తేర్ డివిజన్ అధికారులు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి

- డీఆర్వో పద్మావతి

సాక్షి,పాడేరు: అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు దినపత్రికలు, చానళ్లలో ప్రకటనలు ఇచ్చేందుకు, సభలు,సమావేశాలు, ర్యాలీలు నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఆర్వో పద్మావతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎంసీసీ సభ్యులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఆమె పలు సూచనలు చేశారు. అన్ని దరఖాస్తులను పరిశీలించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ముందస్తు అనుమతులు జారీ చేస్తుందన్నారు. అన్ని అంశాలకు సంబంధించి రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు.మాస్టర్ ట్రైనీ, జిల్లా అడిట్ అధికారి సువర్ణఫణి ఎన్నికల నియమావళి అమలు,ఎన్నికల విధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో పి.గోవిందరాజులు, డివిజనల్ డీపీఆర్వో పి.రాములు, ఎన్ఎస్ఎస్ పీవో గౌరిశంకరరావు, పి.సూర్యారావు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

హైవేపై ఢీకొన్న రెండు ద్విచక్ర వాహనాలు



గూడెం కొత్తవీధి: రింతాడలోచింతపల్లి మార్గంలోని జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఎదురెదురుగా వస్తున్న బైకులు బలంగా ఢీకొని చెల్లాచెదురయ్యాయి. అదృష్టవశాత్తూ వాహన చోదకులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

- దాదాపు 99శాతం మందికి నగదు అందజేత
- పింఛన్‌దారులకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చర్యలు

సామాజిక పింఛన్ల పంపిణీ ఇలా..

జిల్లా	పింఛనర్లు	పంపిణీ	శాతం
విశాఖపట్నం	1,65,432	1,63,553	98.86
అనకాపల్లి	2,66,208	2,63,232	98.88
అల్లూరి	1,27,894	1,26,573	98.97

సాక్షి, విశాఖపట్నం: పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము అందకుండా చంద్రబాబు వేసిన ఎత్తులు ఫలించలేదు. పింఛన్ డబ్బుతోనే జీవిస్తున్న పేద కుటుంబాలను అవస్థలు పాల్జేయాలన్న కుయుక్తులూ సాగలేదు. వలంటీర్లపై కొన్నాళ్లుగా పగబట్టిన చంద్రబాబు ఆ వ్యవస్థనే సమూలంగా లేకుండా చేయాలని కుట్ర పన్నిన సంగతి తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారితో పింఛన్ సొమ్ము పేదలకు పంపిణీ చేయకుండా అడ్డుపడ్డారు. వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లకుండా ఎన్నికల సంఘం(ఈసీ) ద్వారా నిలువరించారు. దీంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము కోసం మండుటెండలు, వడగాడ్పుల్లో సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం.. బాబు ఎత్తుగడను, పింఛనుదారుల ఇబ్బందులను గమనించి పింఛన్ పంపిణీలో జాప్యం జరగకుండా సత్వర చర్యలు చేపట్టింది. సచివాలయాల్లో వీరికి పింఛన్ సొమ్ము వెనువెంటనే అందించేలా ఏర్పాట్లు చేసింది. పింఛన్‌దారులకు మంచినీరు, కుర్చీలు, షామియానాలు వంటివి సమకూర్చింది. ఇలా ఈ నెల నాలుగో తేదీ మధ్యాహ్నం నుంచి మొదలైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం పొద్దుపోయే వరకు కొనసాగింది. సచివాలయాలకు వెళ్లి పెన్షన్ అందుకోలేని వారు(మంచాన పడిన), అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులకు వారి ఇళ్లకే సచివాలయ సిబ్బంది వెళ్లి సొమ్ము అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అలాంటి వారిళ్లకు సచివాలయ కార్యదర్శులు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి వచ్చారు.

ఇలా రెండున్న రోజు ల్లోనే ఉమ్మడి విశాఖ జిల్లాలో 98.9(దాదాపు 99) శాతం మందికి పైగా పింఛన్‌దారులకు డబ్బులు అందజేశారు. కాగా.. గడిచిన 58 నెలలుగా తమకెలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా తమ ఇంటికే పింఛన్ సొమ్ము పంపించారని పింఛన్‌దారులు గుర్తు చేసుకుంటున్నారు. తమ సంతోషాన్ని సహించలేని చంద్రబాబు కుట్రలు పన్ని మలమల మాడే ఎండల్లో ఉసూరుమంటూ సచివాలయాలకు వెళ్లే పరిస్థితి తీసుకొచ్చారని శాపనార్థాలు పెడుతున్నారు. తాను మళ్లీ ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ల ద్వారా ఎప్పటిలాగే ఇళ్ల వద్దనే పింఛన్ సొమ్ము అందించేలా ఈ ఫైల్‌పైనే తొలి సంతకం చేస్తానని సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రకటన.. పండుటాకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న సిబ్బంది

చర్మవ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులతో మాత్రలను మింగిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు చర్మ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న విద్యార్థినులకు అవసరమైన సబ్బులు, ఆయింట్‌మెంట్లు, మందులు పంపిణీ చేశారు. విద్యార్థినులతో మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ట్లాడుతూ ఈ ఏడాది ప్రయోగాత్మకంగా పది ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో 60 నుంచి 70 శాతం మంది విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు చర్మ వ్యాధులపై మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు సోషల్ సబ్జెక్టులో పాఠ్యాంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ లక్ష్మీ సరోజ బృందం, ఏటీడబ్ల్యూవో రజని, హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ, సీపీఎం కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ పసిని, మర్రివలస గ్రామాల్లో టీడీపీ, సీపీఎంకు చెందిన 250 కుటుంబాల గిరిజనులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం స్థానిక సర్పంచ్ కోటపర్తి చిరంజీవి ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ నెగ్గెల గంగులు, వార్డు సభ్యులు రామయ్య, జోగారావు, పోలయ్య తదితరులకు అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వారంతా జైజగన్ అంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి దానియేలు, ఉపాధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ, జన్ని జోగయ్య, రామారావు, పల్లిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్



లింగాపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్

కూనవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని రేగులపాడు, లింగాపురం, సీతారామ్‌పురం, కూటూరు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగులపల్లి ధనలక్ష్మి, అరకు పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ గుమ్మా తనూజరాణిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో పరుగులు పెడుతుందన్నారు. పేద ప్రజలకు ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. చంద్రబాబు నాయుడు కేవలం పెత్తందార్ల కోసమే పనిచేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్లు దీకొండ గంగాధర్‌రావు, అరవా వెంకటరామారావు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, సర్పంచ్‌లు కారం పార్వతి, సున్నం అభిరాం, కట్టం లక్ష్మి, చిలకం హరనాథ్ చిచ్చడి మంజుల, భరతమూర్తి, కొమ్మాని మోహన్‌రావు, సోందె పాపారావు, ఎస్ సత్యనారాయణ, సత్తిపండు, కొమ్మాని వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలు



ఘాట్ రోడ్డులో బోల్తా పడిన ఆటో



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎన్‌టీ శ్రీను

జి.మాడుగుల: మండలంలో వులుసుమామిడి ఘాట్ రోడ్డులో శుక్రవారం రాత్రి ఓ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం కోరంగి గ్రామం నుంచి శుక్రవారం ఉదయం పనుల నిమిత్తం కొయ్యూరు వెళ్లి రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. పులుసుమామిడి ఘాట్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోరంగి గ్రామానికి చెందిన కె.బి.ఎం.రాజు, ఈ.బాలరాజు, ఎస్.రవితేజ, ఎస్.కుమారి, కె.బాలకృష్ణ గాయపడ్డారు. క్షతగాత్రులకు 108 వాహనంలో ఈఎన్‌టీ శ్రీను ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీకొని యువకుడి దుర్మరణం

ఎటపాక: జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఎటపాక సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిపాక గ్రామానికి చెందిన వలంటీర్ మడివి కమలకు అనారోగ్యం కారణంగా ఆమె కుమారుడు చందు ద్విచక్ర వాహనంపై భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తెలంగాణా రాష్ట్రం ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన పెట్టెం రాజు(30) చోడవరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం నెల్లిపాక వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై చోడవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎటపాక మండలం పరిధిలోని నెల్లిపాక ఫారెస్ట్ చెక్ పోస్టు వద్దకు వచ్చేసరికి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. చందుకు తీవ్ర గాయాలు కాగా.. ఆయన తల్లి కమల స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎటపాక సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి ఘటనా స్థలానికి చేరుకుని రాజు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ఘటనా స్థలంలో రాజు మృతదేహం

